సాక్షి
తిరుపతి
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



మిన్నంటిన ఆర్తనాదాలు

రేణిగుంట సమీపంలో ఓ ప్రయివేటు కంపెనీ బస్సు బోల్తా పడింది. క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. - 8లో



ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టిన ఘటన దొరవారి సత్రం మండలంలో చోటుచేసుకుంది. - 8లో



సప్తగిరుల ప్రదక్షిణ ప్రారంభం

మంత్ర పీఠ పీఠాధిపతి ఆధ్వర్యంలో మంగళవారం తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ ప్రారంభమైంది. - 8లో

న్యూస్‌రీల్

జిల్లాలో రెండు రోజుల మంత్రి పర్యటన

తిరుపతి అర్బన్: జిల్లాలో రెండు రోజుల పాటు సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటించనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సత్యవేడు శ్రీసిటీతోపాటు తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాల వద్ద ఓ సైట్‌ను, శ్రీకాళహస్తి మండలంలో క్రాఫ్ట్ క్లస్టర్ ప్రాజెక్టును, రేణిగుంట మండలంలో పొదుపు సంఘాల సభ్యులతో ఇంటరాక్షన్ ఉంటుందని వెల్లడించారు. అలాగే గురువారం తిరుమల దర్శనంతోపాటు తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో చిన్నతరహా పరిశ్రలమకు సంబంధించి రివ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి వేసవి సెలవులు

తిరుపతి ఎడ్యుకేషన్ : మండుటెండల నేపథ్యంలో ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 12న పాఠశాలలను పునఃప్రారంభించాలని పేర్కొంది. ఆ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్.కుమార్ తెలిపారు.

ఇలా సద్వినియోగం చేసుకోండి

వేసవి సెలవులను చక్కగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించుకుంటే ఇటు ఆరోగ్యం, అటు విజ్ఞానం రెట్టింపవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో వివిధ క్రీడా సంస్థలు, కొన్ని విద్యాసంస్థలు అందించే వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. క్రీడలు, సృజనాత్మకతను పెంపొందించే పలు అంశాలు, నృత్యం, నాట్యం, చిత్రలేఖనం, యోగా, అబాకస్ తదితర అంశాల్లో శిక్షణ తీసుకోవడం ద్వారా ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు, చదువుపై జిజ్ఞాస రెట్టింపవుతుందని పేర్కొంటున్నారు.

క్రిస్ సిటీ భూముల పరిశీలన

కోట: కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని ఇండస్ట్రియల్ సెజ్‌లో క్రిస్ సిటీ భూములను మంగళవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. అధికారులు రూపొందించిన తుది జాబితా ప్రకారం త్వరలో రైతులకు పరిహారం ప్రకటిస్తామని చెప్పారు. తమకు పంట నష్టపరిహారం చెల్లించాలని వేరుశనగ సాగు చేస్తున్న రైతులు జేసీని కోరారు. దీనిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జేసీ వెంట గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దార్ జయజయరావు ఉన్నారు.

పాఠశాలను మార్చొద్దు



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పెళ్లకూరు: మండలంలోని చెన్నప్పనాయుడుపేట దళిత వాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట మంగళవారం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ న్యూఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా 1, 2, 3 తరగతులను ఫౌండేషన్ స్కూల్ కింద, 4, 5 తరగతులను బేసిక్ స్కూల్ కింద మార్పుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. దీంతో కొన్ని పాఠశాలలు విలీనమవుతున్నాయి. ప్రస్తుతం కాలనీ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు స్థానిక పాఠశాలను మిక్స్ చేశారని తెలిపారు. దీంతో పిల్లలు అవస్థలు పడాల్సిన వస్తుందని వాపోయారు. స్థానిక దళితవాడలోనే పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అరటిపండ్ల అలంకరణలో గంగమ్మ తల్లి



జాతర నెల రెండవ మంగళవారం తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి అరటి పండ్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించి పునీతులయ్యారు. అమ్మవారి అలంకరణకు దాతలు లావణ్యారెడ్డి, మహేష్‌రెడ్డి, టీడీ శారదమ్మ సహకారం అందించారు. భక్తులకు ఆలయ ఈఓ ఏ.జయకుమార్ అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

– తిరుపతి కల్చరల్



వానెల్లూరు ప్రాంతం నుంచి టిప్పర్లకు లోడ్ చేస్తున్న మట్టి

ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతాలైన సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లోని ఎర్ర గ్రావెల్ మట్టిని కొల్లగొడుతున్నారు. తమిళనాడుకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు రోజుకు రూ.15 లక్షల విలువ చేసే మట్టిని దోచుకుపోతున్నారు. 'అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత' చందంగా చెలరేగిపోతున్నారు. కమీషన్లు ఎరచూపి రైతులనూ బురిడీ కొట్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎర్రమట్టి.. కొల్లగొట్టి!

- యథేచ్ఛగా తమిళనాడుకు తరలింపు
- రోజుకు రూ.15 లక్షల మట్టి సరిహద్దుల దాటవేత
- స్థానిక నేతలు, డీకేటీ రైతులకు తమిళ మాఫియా ఎర
- పట్టించుకోని అధికారులు



మట్టి లోడింగ్ కోసం వేచి ఉన్న టిప్పర్లు

సత్యవేడు: సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లోని ఎర్రమట్టిని యథేచ్ఛగా దోచుకుపోతోంది. సత్యవేడు మండలంలోని వానెల్లూరు నుంచి తమిళనాడుకు ఎర్రమట్టి(గ్రావెల్) యథేచ్ఛగా తరలుతోంది. తమిళనాడులో చెన్నై నేషనల్ హైవే పనులు, లోతట్టు ప్రాంతాలు ఎత్తు చేయడం, పట్టణ ఆధునికీకరణ, భారీ వంతెనలు, రోడ్డు విస్తరణ వంటి పనులకు అక్కడి కాంట్రాక్టర్లు మట్టి కోసం ఇక్కడకొచ్చి వాలిపోతున్నారు. తమిళనాడులో మట్టి తవ్వకాలకు అక్కడి ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో కాంట్రాక్టర్లు, అక్రమార్కులు సరిహద్దు ప్రాంతాలైన సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల వైపు కన్నేశారు. ఆంధ్రా- చెన్నై సరిహద్దులోని మండలాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా ఉంటూ మట్టిని కాజేస్తున్నారు. స్థానికుల పేర్లతో మైనింగ్ అనుమతి తీసుకుని సంబంధిత అధికారులకు కమీషన్లు ఇచ్చి తమ పని కానిచ్చేస్తున్నారు.

పేద రైతులే టార్గెట్

సత్యవేడు పరిధిలోని పెద్ద ఈటిపాకం, వానెల్లూరు, కొల్లడం, జడేరి, ఏఎంపురం పంచాయతీలతోపాటు వరదయ్యపాళెం మండలంలోని చెదులపాకం, చిలమత్తూరు, కారిపాకం, బత్తలవల్లం పంచాయతీల పరిధిలో డీకేటీ భూములు కలిగిన రైతులనే తమిళనాడు కాంట్రాక్టర్లు ఎంచుకుంటున్నారు. డబ్బులు ఆశజూపి చెలరేగిపోతున్నారు. ఆర్థిక స్తోమత లేక బీళ్లుగా వదిలేసిన భూముల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు.

వానెల్లూరులో మట్టి క్వారీ

వరదయ్యపాళెం మండలం, మత్తేరిమిట్టకు చెందిన కే.రామలింగం పేరున సత్యవేడు మండలంలోని వానెల్లూరు పంచాయతీలో క్వారీకి అనుమతి పొందారు. మట్టి ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తారు అన్న సమాచారాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. గ్రామ పరిధిలో సర్వే నం.101–2,5,6,15,17,19లో సుమారు 5 ఎకరాల డీకేటీ భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఆపై దాన్ని ప్రభుత్వ భూమిగా మార్చి అందులో లక్ష 40 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకొనేందుకు మైనింగ్ అధికారుల నుంచి అనుమతి పొందారు. అయితే ఈ మట్టి స్థానికంగానే తరలించాల.. లేక సరిహద్దులు దాటించాలా..? అనే విషయాన్ని అధికారులు చెప్పకపోవడం విమర్శలకు తావిస్తోంది.



మట్టి తొలగింపుతో బావులను తలపిస్తున్న గోతులు

డీకేటీ భూములు స్వాధీనం ఇలా..

డీకేటీ పట్టాదారునితో మట్టి మాఫియా మంతనాలు జరుపుతుంది. స్థానిక నాయకులతో కలసి భూమికి విలువకట్టి పరిహారం ఇస్తారు. రెవెన్యూ కార్యాలయంలో పట్టాను రద్దు చేయించి ప్రభుత్వ భూమిగా ఉన్నట్లు రికార్డులు సృష్టిస్తారు. ఆ తరువాత మైనింగ్ పర్మిషన్ తీసుకుని క్వారీని సిద్ధం చేస్తారు. ఈ తతంగమంతా బడా నేతల కనుసన్నల్లో జరుగుతోంది. వీరికి పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నట్లు సమాచారం.

మామిడి రైతుల ఆందోళన

వానెల్లూరు పంచాయతీలో సర్వే నం.101లో ఉపాధి హామీ పథకంలో కొంత మంది రైతులు మామిడి తోటల పెంపకం చేపట్టారు. ప్రస్తుతం ఉన్న మట్టి క్వారీ మామిడితోటలకు అతి సమీపంలో ఉంది. క్వారీలో సుమారు 15 నుంచి 20 అడుగుల లోతు వరకు గ్రావెల్ తవ్వేస్తున్నారు. ఈ క్రమంలో వేసవిలో మామిడి చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

రూ.కోట్ల మట్టి తరలింపు

తమిళనాడులో టిప్పర్ ఎర్రమట్టి దాదాపు రూ.15 వేలు పలుకుతోంది. సత్యవేడు నుంచి రోజు సుమారు 100 టిప్పర్లు మట్టిని తరలిస్తున్నాయి. అంటే రోజుకు రూ.15 లక్షలు. ఈ లెక్కన నెలకు రూ.4.5 కోట్ల విలువైన మట్టిని తరలించుకుపోతున్నారు. వానెల్లూరులో మట్టి తరలింపునకు మైనింగ్ లీజు కింద స్వల్పంగా చెల్లించినట్లు తెలిసింది.

ఎలాంటి ఫిర్యాదులు అందలేదు

వానెల్లూరులో నిర్వహిస్తున్న గ్రావెల్ మట్టి క్వారీకి అనుమతి ఉంది. 2021 మే 26న మైన్స్ అధికారులు సుమారు 1.2 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ మట్టి తవ్వకానికి అనుమతులిచ్చారు. అనుమతులకు మించి మట్టి తరలిస్తున్నట్లు మైన్స్ రాయల్టీ నుంచి ఫిర్యాదులు రాలేదు. ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటాం

– రాజశేఖర్, తహసీల్దార్, సత్యవేడు

పరీక్షలు గాలికొదిలేసి...
నాయకుల పుట్టిన రోజు వేడుకలా?

తిరుపతి సిటీ: డిగ్రీ పరీక్షలపై శ్రద్ధ పెట్టకుండా రాజకీయ నాయకుల పుట్టిన రోజు వేడుకల్లో వర్సిటీ అధికారులు మునిగితేలుతుండడం క్షమించరాని విషయమని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ ఏడీ బిల్డింగ్ ఎదుట ఏబీవీపీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వీసీ అప్పారావును కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగళవారం నుంచి జరగాల్సిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. సక్రమంగా విద్యార్థులకు హాల్‌టికెట్లను సైతం ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో అధికారులు ఉండడం దారుణమన్నారు. రాజకీయ నాయకుల బర్తడేలు దగ్గరుండి అన్ని తామై చూసుకున్న వర్సిటీ అధికారులు డిగ్రీ పరీక్షల నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడం విచారకరమన్నారు. డిగ్రీ పరీక్షలకు హాల్‌టికెట్లు తప్పుల తడకగా ముద్రించి విద్యార్థుల మొహంపై కొట్టారని విమర్శించారు. వర్సిటీ అధికారులు విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని, లేని పక్షంలో పోరుబాట తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేంద్ర, నగర కార్యదర్శి నందకిషోర్, బాలు నాయక్, తేజ పాల్గొన్నారు.



పరిపాలనా భవనం వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

పకడ్బందీగా పెంచలకోన బ్రహ్మోత్సవాలు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషిణి అనూష సిబ్బందిని ఆదేశించారు. రాపూరు మండలం, పెంచలకోనలోని కమ్మకల్యాణ మండపంలో మంగళవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆమె మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మే 9 నుంచి 14వ తేదీ వరకు లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు నీటి సమస్య లేకుండా చూడాలని, అలాగే చిరుత పులుల నుంచి రక్షణ కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ అపిల్‌కుమార్ మాట్లాడుతూ రాపూరు, నెల్లూరు, రాజంపేట, బద్వేల్, కడప తదితర ప్రాంతాల నుంచి సుమారు 130 బస్సులు నడపనున్నట్టు వెల్లడించారు. అనంతరం సీఐ సత్యనారాయణ, డాక్టర్ ధర్మేంద్ర మాట్లాడారు. ఏసీ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గోనుపల్లిలోని మద్యం దుకాణాలను బ్రహోత్సవాలయ్యే వరకు మూసివేయాలని సంబంధిత ఎక్సైజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఏసీ జనార్ధన్‌రెడ్డి, ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, తహసీల్దార్ లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ భవాని, రేంజర్ రవీంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్ రావు, ఏఈ ఆంజనేయులు, ఆర్అండ్‌బీ ఏఈ మనోహర్, అగ్నిమాపక అధికారి కుప్పయ్య, విద్యుత్ డీఈ సురేష్ పాల్గొన్నారు. అనంతరం నెల్లూరు ఆర్డీఓ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.



పెంచలకోన బ్రహోత్సవాలపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ అనూష

పౌష్టికాహారానికి తొలి ప్రాధాన్యం

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ పాఠశాలల్లో పౌష్టికాహారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఐసీడీఎస్ పీడీ వసంతబాయిని ఆదేశించారు. నిత్యం అంగన్‌వాడీ పాఠశాలల పై నిఘా పెట్టాలన్నారు. ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు 14 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాల్లో చేపట్టిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భవతులకు సీమంతం, చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, డీపీఓ శాంతకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజినీర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

జీతమో రామ'చంద్రా'!



తిరుపతి సిటీ: ఎస్వీయూలో వేతన వెతలు కొనసాగుతున్నాయి. గత పది నెలలుగా ఏ రోజూ నెల ఒకటి, రెండు తారీఖుల్లో వేతనలు అందిన దాఖలాలు లేవు. మార్చి నెల వేతనం ఇప్పటి వరకు అందకపోవడంతో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులతో పాటు పెన్షనర్లు అవస్థలు పడుతున్నారు. ఎస్వీయూ చరిత్రలో ఇలాంటి గడ్డు పరిస్థితులు ఇప్పటి వరకు చూడలేదని ఆవేదన చెందుతున్నారు.

దయనీయం

గత ఏడాదిగా వర్సిటీలో నాలుగు వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు సకాలంలో జీతాలందక దుర్భర జీవితాలను గడుపుతున్నాం. పిల్లలకు వేసవి సెలవులు వచ్చినా చేతిలో చిల్లిగవ్వ లేక.. బయట తిరగలేక పోతున్నాం. వడ్డీలకు అప్పులు చేస్తున్నాం.

– వర్సిటీ ఉద్యోగులు, పెన్షనర్లు

తిరుపతిలో షాడో ఎమ్మెల్యే దాష్టీకం

- ల్యాండ్ మాఫియాను పెంచి పోషిస్తున్న తిరుపతి షాడో ఎమ్మెల్యే ఆరణి శివకుమార్
- భూ దాహంతో భూ బకాసుర అవతారం
- తమ స్థలం కబ్జాకు యత్నిస్తున్నారని మీడియాకు తెలిపిన వారి కుటుంబీకులపై దాడి

తిరుపతి క్రైం: తిరుపతిలో పేరుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అయినా వెనుకుండి వ్యవహారాలను అన్నీ నడిపేది మాత్రం షాడో ఎమ్మెల్యే ఆరణి శివకుమార్. చిన్నచిన్న సెటిల్మెంట్ల నుంచి భూకబ్జాల వరకు అంతా ఆయన కనుసన్నల్లో సాగాల్సిందే. ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు గెలిచిన వెంటనే షాడోగా వ్యవహరిస్తున్న శివకుమార్ పై అనేక విమర్శలు వచ్చాయి. దీంతో కొన్నాళ్ల పాటు సైలెంట్ అయిన శివకుమార్ మళ్లీ తిరుపతిపై పడ్డారు. మూడు నెలలుగా తిరుపతిలో ఖాళీ స్థలాలపై కన్నేసి తన భూ దాహాన్ని తీర్చుకుంటున్నారు.

ప్రశ్నించిన వారిపై ఎదురుదాడి

శివకుమార్ అరాచకాలపై స్థానిక కాంట్రాక్టర్ శ్రీమన్నారాయణరెడ్డి సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆరణి శివ తిరుపతిలో చేస్తున్న అరాచకాలను, భూకబ్జాలను ఎండగట్టారు. ఆధారాలతో సహా మీడియా ముందు ఉంచారు. తిరుపతిలోని నారాయణపురం కైకాలచెరువు వద్ద ఉన్న సర్వే నం.3-2సీ2ఈ2ఏ 1బీ, 3-2సీ 22ఏ 1ఏ, ఏ2లోని రెండు ఎకరాల స్థలం తన భార్య డీ.స్వర్ణ పేరుపై ఉందని తెలిపారు. ఈ స్థలంపై కన్నేసిన ఆరణి శివకుమార్ పీలేరుకు చెందిన మనోహర్, ఎస్పీడీసీఎల్ ఏఈ రజనీకాంత్‌తో కలసి కబ్జాకు యత్నించాడని తెలిపారు. ఆయన నిజస్వరూపాన్ని బయట పెట్టినందుకు శివకుమార్ అనుచరులు తన కుమారుడు, భార్యపై మంగళవారం దాడికి తెగబడ్డారని శ్రీమన్నారాయణరెడ్డి మీడియాకు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చినా న్యాయం జరిగే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ వద్దకు వెళ్తే ఆ ల్యాండ్‌లో ఎలాంటి పనులు, కట్టడాలు చేపట్టకూడదని ఆదేశించారనిం, భూ పత్రాలు పరీక్షించి విచారణ జరిపిన అనంతరం ఈ విషయం పై ఆలోచన చేస్తామనిం, అంతవరకు ఎవరూ ఆ స్థలంలో ఎలాంటి పనులు చేపట్టకూడదని తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి శివకుమార్ అనేక ఒత్తిళ్లు తెచ్చి తమపై దాడికి పాల్పడే విధంగా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, సీఎం చంద్రబాబు నాయుడు తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- రెండున్నర నెలలుగా అందని వేతనం
- ఉపాధిపై నమ్మకం లేక ఇతర పనుల వైపు మొగ్గు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వెంకటగిరి(సైదాపురం): జిల్లా వ్యాప్తంగా రెండున్నర నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందక అవస్థలు పడాల్సి వస్తోంది. సహజంగా వారం వారం ఉపాధి కూలి అందించాల్సి ఉంది. కానీ నెలల తరబడి అందించకపోవడంతో ఏం చేయాలో తెలియక కూలీలు తలలు పట్టుకుంటున్నారు. పని చేసినా పస్తులుండాల్సిన పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు. దీంతో చేసేది లేక ప్రత్యామ్నాయ పనుల వైపు మొగ్గు చూపాల్సి వస్తోందని చెబుతున్నారు.

సౌకర్యాలు నిల్

పనిచేసే ప్రదేశంలో కనీస వసతులు ఉండడం లేదు. విశ్రాంతి తీసుకోవడానికి టార్పాలిన్ పట్టతో నీడ కల్పించాల్సి ఉంది. అదేవిధంగా మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ లాంటివి పంపిణీ చేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవేవీ కల్పించకపోగా.. కనీస వసతులకు ప్రాధాన్యమివ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జిల్లా సమాచారం

మండలాలు 34	పంచాయతీలు 774
జాబ్‌కార్డులు 2.66లక్షలు	పనిదినాలు 2.22లక్షలు

అ'ధనం' ఎక్కడ?

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి కూలీలకు సగటున రూ.305 వేతనం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంది. అలాగే వేసవి నేపథ్యంలో కూలీలు చేసే పనులపై 20 శాతం అధనంగా కూలీలకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. కానీ ఇవన్నీ ప్రకటనలకు మాత్రమే పరిమితమవ్వడంపై కూలీలు నిట్టూర్చుతున్నారు.

రూ1.50 కోట్ల వరకు రావాల్సి ఉంది

ఉపాధి కూలీలకు రూ.1.50 కోట్ల మేర వేతనాలు రావాల్సి ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కూలీలకు వేతనాలు విడుదల కాలేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– జ్యోతి, ఏపీఓ, బాలాయపల్లి మండలం

ఆకలితో అలమటిస్తున్నాం

ఉపాధి కూలీలు చెల్లించడంలేదు. ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంతేగాకుండా వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు.

–పుల్లయ్య, జంగాలపల్లి పంచాయతీ, వెంకటగిరి రూరల్ మండలం

సకాలంలో చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు సకాలంలో చెల్లించాలి. ఉపాధి పనులు నమ్ముకుని గ్రామాల్లో ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆ కూలీలకు నగదు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

– వెంకటరమణయ్య, బాలాయపల్లి, బాలాయపల్లి మండలం

క్లుప్తంగా

దాడి చేసిన వారిపై కేసు


గాయపడిన వరాలు

సైదాపురం: మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీకి చెందిన నక్కా వరాలుపై అదే కాలనీకి చెందిన నక్కా శ్రీనయ్యతో పాటు మరో వ్యక్తి ఆదివారం దాడిచేసి గాయపరిచారు. గతంలో విరిమధ్య పాతకక్షలు ఉండడంతో వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నక్కా వరాలుపై కర్రలతో దాడిచేసి గాయపరిచారు. ఈ మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి


గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్ చంద్ర

పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రపై ఆ శాఖ ఏపీఓ దయానంద్ దాడికి పాల్పడడంతో రక్త గాయాలయ్యాయి. బాధితుని కథనం.. పునబాక గ్రామంలో ఉపాధిహామీ పనులకు సంబంధించిన మస్టర్లు నమోదు విషయంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఏపీవో క్యారీయర్ బాక్సుతో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రపై దాడిచేశాడు. ఈ దాడిలో చంద్ర తలకు రక్తగాయమైంది. స్థానికులు పెళ్లకూరు పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం నాయుడుపేటకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భూసేకరణ వేగవంతం



తిరుపతి అర్బన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణతో పాటు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన వర్చువల్ పద్ధతిలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. రేణిగుంట, పూడి, గూడూరు, పాకాల, తిరుపతి టౌన్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పనులు పూర్తయ్యాయని, ఆరు లేన్ల రహదారి నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని చెప్పారు. రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రహదారి పనులు పూర్తి చేయాలని చెప్పారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, హైవే పీడీలు వెంకటేష్, ఎంకే చౌదరి, డిప్యూటీ తహసీలార్దుర్ భాస్కర్ పాల్గొన్నారు.

27 నుంచి బ్యాక్‌లాగ్ ప్రవేశాలకు పరీక్ష

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలోని బ్యాక్ లాగ్ వేకెన్సీలకు సంబంధించి ప్రవేశ పరీక్ష ఈనెల 27, 28 తేదీలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని ప్రిన్సిపల్ కే.రేష్మా తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు మంగళవారం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ mjpapbcwreis.apcfss.in ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

మిన్నంటిన ఆర్తనాదాలు

- ప్రయివేటు బస్సు బోల్తా ఘటనలో తల్లడిల్లిన బాధితులు
- అంబులెన్స్ ఆలస్యం కావడంతో రోడ్డుపైనే క్షతగాత్రులు


బోల్తా పడిన బస్సు, ట్రాక్టర్ ట్రాలీ

(రేణిగుంట శ్రీకాళహస్తి రూరల్): బాధితులు తల్లడిల్లిపోయారు. రక్తగాయాలతో ఆర్తనాదాలు పెట్టారు. ఈ ఘటన స్థానికులను కలచివేసింది. వివరాలు.. రేణిగుంట మండలం, మర్రిగుంట సర్కిల్‌లో మంగళవారం ఉదయం 7.40 గంటలకు ఓ ప్రయివేటు కంపెనీ బస్సు, ట్రాక్టర్ అతివేగంగా వచ్చి అదుపుతప్పి బోల్తా పడ్డాయి. ఈ ఘటనలో బస్సులో ఉన్న సుమారు 45 మంది ఉద్యోగుల్లో 30 మంది మహిళా ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బోల్తా పడిన బస్సు నుంచి బాధితులను స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. కానీ క్షతగాత్రులను సకాలంలో హాస్పిటల్‌కు తరలించేందుకు అంబులెన్స్‌లేవీ అందుబాటులో లేవు. సుమారు అరగంటపాటు రోడ్డుపైనే రక్తగాయాలతో ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో బాధితుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఆపై సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

రాంగ్ రూటే ప్రమాదానికి కారణం!

మర్రిగుంట సర్కిల్ నుంచి విమానాశ్రయ పాత రహదారిలోకి వెళ్లేందుకు సుమారు 500 మీటర్ల వరకు వన్‌వే ఉంది. తొందరగా గమ్యానికి చేరాలన్న ఉద్దేశంతో సర్కిల్ నుంచి వన్ వేలో వాహనాలను నడుపుతుంటారు. ఆ క్రమంలో హైవేలో అతివేగంగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. ఇలాంటి ఘటనలే గతంలో అనేకం చోటు చేసుకున్నాయి. వన్‌వే ఉన్న ప్రాంతంలో కనీసం నో ఎంట్రీ బోర్డులు కూడా పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.


ఆస్పత్రిలో క్షతగాత్రులు


బోల్తాపడిన బస్సు


క్షత గత్రులను చికిత్స నిమిత్తం ఆటోలో తరలిస్తున్న దృశ్యం


తీవ్ర గాయాలైన మహిళా కార్మికురాలు


రోడ్డుపైనే ఆర్తనాదాలు పెడుతున్న క్షతగాత్రులు

జూనియర్ జడ్జిల బదిలీలు

తిరుపతి లీగల్/ చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ జడ్జీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు మూడవ అదనపు జూనియర్ జడ్జి ఎస్. శ్రీనివాస్‌ను పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, నగిరి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్. విష్ణువర్మను వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జిగాను, పీలేరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.గాయత్రిని గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, పుత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. గోపాలకృష్ణను తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వై. సరితను బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, గన్నవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి బి.శిరీషను చిత్తూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.శిల్పను చిత్తూరు ఎక్సైజ్ కోర్టు జడ్జిగా, తణుకు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ. వెంకటనాగరాజును సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జిగా, ధర్మవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రమ్య సాయిని పుత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, కల్యాణదుర్గం సివిల్ జడ్జి బి.సుభాన్‌ను మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన న్యాయమూర్తులు మే రెండో తేదీలోపు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు


కారులో ఇరుక్కుపోయిన కృష్ణచందును బయటకు తీస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుకనే వస్తున్న కారు వేగంగా ఢీకొనడంతో కారులో ప్రయాణించే భార్యాభర్త కృష్ణ చందు, పల్లవి, ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్య గాయపడిన ఘటన మంగళవారం టపాయిండ్లు గ్రామ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం.. అక్కరపాక గ్రామం నుంచి సూళ్లూరుపేటకు ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను విజయవాడ నుంచి చెన్నైకి వెళ్లే కారు అదుపు తప్పి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే భార్యాభర్తలు కృష్ణచందు, పల్లవితో పాటు ట్రాక్టర్ గురవయ్య గాయపడ్డారు. కారు ముందు భాగంగా దెబ్బతింది. కృష్ణచందు కారులో ఇరుక్కుపోయాడు. తర్వాత క్రైన్ సాయంతో సిబ్బంది బయటకు తీశారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను మొదట సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మేరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ఏఐతో భావి తరాలకు సంస్కృత జ్ఞానం


సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మెషిన్ లెర్నింగ్‌తో భావితరాలకు సంస్కృత జ్ఞానాన్ని అందించవచ్చని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. జాతీయ సంస్కృత వర్సిటీ, సీ–డాక్ సంస్థ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే అంశంపై మంగళవారం రెండ్రోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ ఎన్ఈపీ–2020 ప్రకారం నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. చెన్నై ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఆధునిక సాంకేతికతను సంస్కృత శాస్త్రాలతో సమన్వయం చేసి సరికొత్త లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శాస్త్రాలలో కృత్రిమ మేధస్సు వినియోగంతో పాటు సంస్కృతంలో ఏఐ ఆధారిత పరిశోధనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సీ–డాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ సంస్కృత వ్యాకరణం, పద నిర్మాణం వంటి అంశాల్లో కృత్రిమ మేధ వినియోగంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, విభాగాధిపతి కే.గణపతి భట్, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ, డాక్టర్ కాళిదాసు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్రశేఖరం, ప్రొఫెసర్ శ్రీధర్, డాక్టర్ మేరి సుజాత, నాగలక్ష్మి, ప్రసన్న, సంకీర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూలకాల సద్వినియోగంలో చైనాను అధిగమిద్దాం


వివరిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీ.బలరాం


సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులు

తిరుపతి సిటీ: అరుదైన మూలకాలను సద్వినియోగం చేసుకోవడంలో చైనాను అధిగమించాల్సి ఉందని హైదరాబాద్ నేషనల్ జియో లాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీ.బలరాం తెలిపారు. ఎస్వీయూ ఫిజిక్స్, పద్మావతి వర్సిటీ బయోటెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా సైన్స్, టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అనే అంశంపై మంగళవారం రెండో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఎన్నో అరుదైన వనరులు లభ్యమవుతున్నాయని, అరుదైన మూలకాలను వెలికి తీసే పద్ధతుల్లో మార్పుచేర్పులు అవసరమన్నారు. సాంకేతిక వినియోగం మరింతగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యురేనియం వంటి అరుదైన మూలకాలును వెలికి తీయడంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. అనంతరం హైదరాబాద్ బిట్స్ ఫిలానీ ప్రతినిధి డాక్టర్ బీఎం రెడ్డితో పాటు దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, రీసెర్చ్ సెంటర్ల పరిశోధకులు, ఓరల్, పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. వీరిని నిర్వాహకులు సత్కరించారు. రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ దీపేంద్రసింగ్, కార్యదర్శి డాక్టర్ ఎమ్మెల్సీ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్, అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ బీ.దేవప్రసాద్‌రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.జాన్‌సుష్మా పాల్గొన్నారు

కాసులిస్తేనే...సర్వే గొలుసు

తిరుపతి తుడా: కాసులు ఇస్తేనే తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని సర్వేయర్లు గొలుసు తెస్తామంటున్నారు. సాధారణంగా రూ.1,500 చలనా చెల్లిస్తే రెండు, మూడు రోజుల్లో తిరుపతి టౌన్ సర్వేయర్లు సర్వే చేయాల్సి ఉంది. ఆ మేరకు సర్వే పూర్తి చేసి ఓ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంది. అయితే కూటమి సర్కార్‌లో సర్వేయర్లకు తమకు ఇవ్వాల్సిన సర్వే వాటా ఇస్తే తప్ప కార్యాలయం నుంచి కదడం లేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని చెప్పినా లెక్కచేయని పరిస్థితి. తాజాగా తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని ఎస్టీవీ నగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి సర్వే కోసం ఈ నెల 10న చలనా పైకం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించారు. చలానా కట్టి 12 రోజులు గడుస్తోంది. ఈ క్రమంలో సర్వేయర్ వద్దకు ఎన్నిసార్లు వెళ్లి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. గట్టిగా ప్రశ్నిస్తే తమకు ఎన్నో పనులుంటాయంటూ సమాధానం దాటవేస్తున్నట్టు బాధితుడు వాపోయాడు.

భూ సంరక్షణ అందరి బాధ్యత


పోస్టర్లను విడుదల చేస్తున్న అదనపు ఈఓ, వీసీ

తిరుపతి సిటీ: భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. మహిళా వర్సిటీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో జీవరాశులన్నీ భూమిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నాయని, బాధ్యతగా భూమిని కాపాడుకోవాలన్నారు. వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుతూ భూమికి పునర్జీవం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రీన్ ఆంధ్ర చాలెంజ్–2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సీఈఓ వెంకటేశ్వర్లు, ఎన్విరాన్‌మెంట్ కార్యకర్త శివాజి, రిజిస్ట్రార్ రజిని, దామోదరంనాయుడు, మార్కండేయులు రెడ్డి, విజయ్‌కుమార్‌నాయుడు, ప్రొఫెసర్ ఆర్.రమణమూర్తి, ప్రొఫెసర్ ఉష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి గీసిన చిత్రం!


ఓ వైపు నీలాకాశం.. మరో వైపు నిండు కుండలా జలపాతం.. వాటి మధ్యన నల్లటి జమ్మి చెట్టు వృక్షం.. నీలాకాశంలో ఈ ప్రకృతి రమణీయ దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది. మండల కేంద్రమైన సైదాపురం చెరువు మధ్యలో ఉన్న జమ్మి చెట్టు ఆకులన్నీ రాలిపోయి మోడుగా కనిపిస్తోంది.
- సైదాపురం

ఉద్యోగ భద్రత కల్పించండి

- మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఆందోళన బాట
- డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన
- అనంతరం భారీ ర్యాలీ


ధర్నా చేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

తిరుపతి తుడా: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సంయుక్తంగా ఆందోళన బాట చేపట్టారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద మంగళవారం నిరసన మిన్నంటించారు. అనంతరం టౌన్‌క్లబ్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని గళం విప్పారు.

ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలి

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుమంత్ మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఎంఎల్‌హెచ్‌పీలను నియమించారన్నారు. వారికి వెంటనే ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని కోరారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. మొత్తం ఎనిమిది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్లు చెప్పారు. ఈ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో కఠినమైన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిమాండ్లు పరిష్కరించాలి



ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి. మొత్తం ఎనిమిది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచాం. వాటిని పరిష్కరించని పక్షంలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం.
–సుమంత్, ఎంఎల్‌హెచ్‌పీ, జిల్లా ప్రెసిడెంట్

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి



ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి. ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు మంజూరు చేయాలి. రాత్రింబవళ్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉంటూ సేవలందిస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి.
–పద్మశ్రీ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్

బకాయిలు చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్లినిక్ అద్దె బకాయిలను చెల్లించాలి. ఎంఎల్‌హెచ్‌పిలకు నిర్దిష్టమైన జాబ్ చార్ట్ రూపొందించాలి. పని ఆధారిత ప్రోత్సాహకాలను అందించాలి. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.
–సౌమ్య, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్

చిన్న చూపు తగదు



మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదు. గర్భిణులు, బాలింతలు, చంటి బిడ్డలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నాం. ఇళ్లకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నాం. మా డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.
–మేరీ కృపావతి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్

చెరువులోకి దూసుకెళ్లిన కారు


ముళ్ల పొదల్లో కారు

పాకాల : చెరువు కట్టపై ప్రయాణిస్తూ ఓ కారు వేగంగా చెరువులోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం మండలంలోని మొగరాల సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దామలచెరువు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లి వైపు వెళుతున్న కారు మొగరాల వద్ద చెరువు కట్టపై వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని తప్పించి చెరువులోని ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ముళ్ల పొదల్లో చిక్కుకున్న కారు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారికి ఏమీ కాలేదు.

తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ ప్రారంభం

తిరుపతి కల్చరల్: మంత్ర పీఠ పీఠాధిపతి స్వామి నరసింహ సింహాయజులు ఆధ్వర్యంలో మంగళవారం భారతీయ విద్యా భవన్ ప్రాంగణం నుంచి అలిపిరి వద్దకు చేరుకుని అక్కడి నుంచి తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఫగ్గన్‌సింగ్ కులస్థి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఠాధిపతి స్వామి నరసింహ సింహాయజులు మాట్లాడుతూ అలిపిరి వద్ద ఆరంభమైన ఈ ప్రదక్షిణ భాకరాపేట, రాయచోటి, రాజంపేట మీదుగా తిరుపతిలోని కపిల తీర్థానికి చేరుకుని కపిలేశ్వరుని దర్శనానంతరం కొండ హారతితో తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ పరిసమాప్తమవుతుందని తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీహరిరావు, గుండాల గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఏ.రంగంపేట విద్యార్థులు


శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పునీత్ రాజ్ కుమార్, పూజ

చంద్రగిరి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మే 1 నుంచి 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొని సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నారు. ఏ.రంగంపేట గ్రామానికి చెందిన పునీత్‌రాజ్‌కుమార్, పూజ ఏ.రంగంపేట ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. మూడేళ్లుగా పీడీ డాక్టర్ ప్రభాకర్ నేతృత్వంలో ఫుట్‌బాల్ క్రీడలో మెలకువలు నేర్చుకున్నారు. గత అక్టోబర్‌లో హిందూపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో వారిద్దరూ జాతీయ స్థాయి పోటీలకు, మరో 20 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్ఎం మదన్‌మోహన్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మే 1 నుంచి జాతీయ ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొననున్నట్టు పీడీ ప్రభాకర్ తెలిపారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటుతాం

చిన్నతనం నుంచి ఫుట్‌బాల్ క్రీడంటే ఇష్టం. పీడీ సారు ప్రోత్సాహంతో ఫుట్‌బాల్‌లో మెలకువలు నేర్చుకున్నాం. గత ఏడాది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఆనందాన్నిచ్చింది. అదే ఉత్సాహంతో మే 1 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో సత్తా చాటేందుకు శిక్షణ తీసుకుంటున్నాం.
– పునీత్ రాజ్‌కుమార్, పూజ, జాతీయ స్థాయికి ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు